Assemblies Of The Living Elohim (1. Tim 3:15) India presents............
పరమతండ్రి ఒక్కడే, ఆయన పేరు ఒక్కటే.

Satyamunakai Poratam REGD. No. 67970 / 97

# సత్యమునకై పోరాటం

Regd. Monthly Newspaper
Postal Regd. No. H/APM/01/2009-2011
Valid upto 12/2011
Posted on 30th of Every Month
Annual Subscription Rs. 50/-
To :

Editor & Publisher :
Bro. Isaac E. Kusuma
Malikipuram - 533 253
E.G. Dist. (A.P.) India.

Website : www.aotle-india.org
E-mail : satyamunakaiporatam@gmail.com
Office : Ph : 98493 85038

VOLUME : 13 AV- ELUL 5770 (JULY 2010) PAGES:4 ISSUE 145

హెచ్చరిక:- ఈ పత్రిక ఖండితముగా సత్యాన్వేషుల కొరకు మాత్రమే గాని క్రైస్తవ మతశాఖల వారి కొరకు కాదు

## దురాత్మ యొక్క లక్షణములు

– బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

ఒక వ్యక్తిలో దురాత్మ దూరడానికి గల ముఖ్య కారణం అసూయ. ఎదుటి వారి గొప్పతనాన్ని ప్రసంశించడానికి బదులు చూసి అసూయ పడడమే దురాత్మకు ముఖ్యకారణం. ఎవరి తలాంతు వారికి ఉంటుంది. ఒకరి తలాంతు వేరొకరికి రాదు. అది వారి వ్యక్తిత్వం మీద ఆధారపడి ఉంటుంది. అంతేకాదు అది పరమతండ్రియైన యావె మీద పెంచుకున్న విధానాన్నిబట్టి కూడా ఉంటుంది. దావీదు జీవిత విధానం వేరు, అతని భక్తి, మర్యాదలు, ఉద్దేశ్యములు వేరు. ప్రతీ వ్యక్తి జీవితంలోనూ ఏదో ఒక గోల్ ఉంటుంది. కొంతమందికి మంచివారెవరైనా సహకారం చేస్తే వాళ్ళు అనుకున్న గోల్ చేరుకుంటారు. మరి కొంతమంది వాళ్ళకు వాళ్ళుగానే కష్టపడి, బాధలు పడి వాళ్ళు అనుకున్నది సాధిస్తారు. మరి కొంతమంది చెడిపోయి, నాశనమైపోయి, ఒక్కసారి వెనక్కి వెళ్ళి వాళ్ళు ఎందుకు పుట్టారో, వాళ్ళు జీవితంలో ఏమి పోగొట్టుకున్నారో తెల్సుకొని అక్కడ నుండే తిరిగి వాళ్ళు అనుకున్నది సాధిస్తారు. సౌలు రాజు ప్రజలద్వారా ఎన్నుకున్న రాజు, దావీదు పరమతండ్రి ద్వారా ఎన్నుకోబడినవాడు. సౌలు జీవితాన్ని–దావీదు జీవితాన్ని జాగ్రత్తగా పరిశీలిస్తే సౌలు ప్రజల ద్వారా ఎన్నుకోబడినవాడు 1సమూ 8:5–22, సౌలుతోను–సముయేలుతోను అని అంటున్నాడే గాని (1సమూ 11:7) పరమతండ్రి నామము ఉచ్చరించుటలేదు. సముయేలు అయితే యావె–సమూయేలు (1సమూ 12:18) అని అంటుకట్టబడ్డాడు. సమూయేలు తన స్వంత ఇష్టాలను–ప్రజల ఇష్టాలను నెరవేర్చువాడు. దావీదు తన స్వంత ఇష్టాలను వదిలి యావె ఇష్టమును నెరవేర్చ మనస్సు గలవాడు. గనుక దావీదు యావెపై తన మనస్సును ఉంచుకున్నాడు. అందుకే పరమతండ్రియైన యావె దావీదును గూర్చి **"నా హృదయ ఇష్టానుసారుడు"** అని సాక్ష్యమిచ్చాడు.

సౌలు సమూయేలు ద్వారా అభిషేకం పొంది, ప్రజలకు రాజైనప్పటికీ, అతని మనస్సు సమూయేలుతో కొద్దిసేపు ఉందేగాని పరమతండ్రియైన యావెతో లేదు. యావె ఆజ్ఞ దిక్కరించి, ప్రజలను సంతోషపరచడానికే ఇష్టపడ్డాడు గాని పరమతండ్రి కొరకు కష్టపడలేదు. అందుకే అతి తొందరలోనే అభిషేకం పోగొట్టుకున్నాడు, సమూయేలు ప్రవక్తకి దూరమయ్యాడు, ప్రజలకు చాలా దగ్గరయ్యాడు, యావెకు మాత్రం చాలా దూరమయ్యాడు, దురాత్మవశమున పడ్డాడు. ఇప్పుడు దురాత్మ నడిపిస్తుంది సౌలును. ఈ దురాత్మకు ఉన్న లక్షణాలు ఏమంటే:

| | | |
|---|---|---|
| 1. | వెరపించబడడం/బాధించబడడం. | 1సమూ 16:14 |
| 2. | శత్రువుని చూసి భయపడడం | 1సమూ 18:29 |
| 3. | సేదతీరని జబ్బు | 1సమూ 16:23 |
| 4. | పిరికితనం | 1సమూ 17:33 |
| 5. | నిజమైన మాటలు ఇంపుగానే లేకపోవడం | 1సమూ 18:8 |
| 6. | వెఱ్ఱిమాటలు పలకడం | 1సమూ 18:10 |
| 7. | బహుగా కోపపడడం | 1సమూ 18:8 |
| 8. | హృదయంలో రకరకాలుగా అనుకోవడం | 1సమూ 18:8 |
| 9. | విషపుచూపు నిలపడం | 1సమూ 18:9 |
| 10. | చంపడానికి మారణాయుధం ఉపయోగించడం | 1సమూ 18:11 |
| 11. | పరమతండ్రి తోడుగాలేడని తెలుసు | 1సమూ 18:12 |
| 12. | యావె బిడ్డలను చూస్తే భయపడడం | 1సమూ 18:12 |
| 13 | పరాయివాళ్ళచేత కొట్టించాలనుకోవడం | 1సమూ 18:17 |
| 14. | మోసం చెయ్యడం | 1సమూ 18:19 |
| 15. | ప్రేమికులను శత్రువులుగా మార్చడం | 1సమూ 18:20,21 |
| 16. | పడగొట్టాలనే ఆలోచనలు కలిగి ఉండడం | 1సమూ 18:25 |
| 17. | భయం ఉంటాది కాని విరోధం మానరు | 1సమూ 18:29 |
| 18. | అల్లుడికి–కూతురికి మధ్య విరోధం పెట్టడం | 1సమూ 18:20 |
| 19. | భార్యను–కుమారుడ్ని కూడా బూతులు తిట్టడం | 1సమూ 20:30 |
| 20. | ప్రేమికులను విడగొట్టడం, బాధపరచడం | 1సమూ 19:11 |
| 21. | లీడర్ కాకపోయినా లీడర్‌లా ఫీలవ్వడం | 1సమూ 22:7 |
| 22. | ప్రార్థనా సమయంలో కూడా పగతీర్చుకోవాలనుకోవడం | 1సమూ 20:27 |
| 23. | అల్లుడికి–కూతురికి ఉరి కల్పించడం | 1సమూ 18:20 |
| 24 | ఏదో మేలు చేస్తున్నట్లు కనిపిస్తూ ఘోరమైన కీడు తలపెట్టడం | 1సమూ 18:25 |
| 25. | భార్య ద్వారా భర్త విషయాలు రాబట్టడం | 1సమూ 19:11 |
| 26. | యావె నామములో దొంగ ప్రమాణాలు చెయ్యడం | 1సమూ 19:6 |
| 27. | సమాచారము సేకరించుటకు వేగులవారిని పెట్టడం | 1సమూ 19:19,20 |
| 28. | పొలాలు, పదవులు ఇస్తానని భ్రమపర్చడం | 1సమూ 22:7 |
| 29. | సహాయం చేసేవారిపై పగపట్టడం, వారిని బాధించడం | 1సమూ 20:30 |
| 30. | యాజకులను సహితం చంపడానికి వెళ్ళడం | 1సమూ 22:16–18 |
| 31. | ముఖాముఖిగా వస్తే నీతిమంతుడనడం, వెనుక తిట్టడం | 1సమూ 24:18 |
| 32. | ఎన్నో దుష్టప్రయత్నాలు చేస్తారు | 1సమూ 23:23 |
| 33. | ప్రయత్నాలన్నీ విఫలమైపోతాయి | 1సమూ 27:4 |
| 34. | పరమతండ్రినుండి కూడా సమాధానం రాదు | 1సమూ 28:6,15,16 |
| 35. | ఆఖరికి చావు కొనితెచ్చుకుంటారు | 1సమూ 31:8,9 |

దురాత్మ ఆవరిస్తే ఇన్ని నీచమైన కార్యములు చేయడానికి పురికొల్పబడి ఆఖరికి చావు కొనితెచ్చుకుంటారు. దాని ప్రభావము అలా వుంటుంది. గనుక మనలను ఏ ఆత్మ నడిపిస్తుంది? ఏ ఆత్మయొక్క ప్రభావము మన మనస్సుపై ఉందో మనం పరిశీలించుకోవాలి.

దురాత్మ రాగానే స్నేహితులు శత్రువులుగా మారిపోతారు. వైరము అనేది దురాత్మవలనే వస్తుంది. న్యాయాధి 9:54– ఒకరిని ఒకరు వంచించుకుంటారు, దూషించుకుంటారు, శత్రుత్వం పెంచుకుంటారు, ఒకరిపై ఒకరు విషపుచూపు నిలుపుకుంటారు. ప్రేమ–సమాధానం అనేది అసలు ఉండదు. యుక్తి–కుయుక్తులు, ఎత్తుకు పై ఎత్తులు వేసుకుంటూ ఉంటారు, రాజకీయపు ఆత్మ వచ్చేస్తుంది. ప్రతీదానిని రాజకీయం చేస్తూనే ఉంటారు. పైకి ఎంత భక్తి నటించినా, అది సాతానుకే జయం గాని పరమతండ్రి జయానికి సూచకం కాదు. మాటలు అనే ఈటెలు విసురుకుంటూ ఉంటారు. మనుష్యులను, వారి మనస్సులను బాధిస్తూఉంటారు. శాంతి–సమాధానం లేకుండా చేస్తారు. పైకి ఏదో మాట్లాడుకుంటారు గాని హృదయాలలో ఎప్పుడో వేరైపోతారు. అంతా నటన జీవితమే గాని హృదయపూర్వకమైన ప్రేమ ఉండదు. అవకాశం కోసం ఎదురుచూస్తూ ఒకరినొకరు చంపుకోవడానికి కూడా వెనుకాడరు. అది దురాత్మ యొక్క లక్షణం. చమత్కారంగా సితారా వాయించినా అది కొద్దిసేపు మాత్రమే గాని శాశ్వతమైన నివృత్తి మాత్రం కాదు. దురాత్మ–పరిశుద్ధాత్మ ఇవి రెండు పరమతండ్రి దగ్గర ఉన్నాయి. పరిశుద్ధాత్మ మనిషిలోనుండి పోగానే దురాత్మ వచ్చి ఆవరించేస్తూ ఉంటుంది. 1సమూ 16:14, 18:9,10, న్యాయాధి 9:24, దురాత్మ తాండవం చేసే ప్రదేశంలో పరిశుద్ధాత్మకు తావుండదు. ఈ రెండు ఆత్మలు–కలిసి ఉండవు. దురాత్మకు అక్షరజ్ఞానం+రాజకీయం+నటన మాత్రమే తెలుసు. కాని పరిశుద్ధాత్మకు ఆత్మజ్ఞానం+సత్యము+సత్‌ప్రవర్తన తెలుసు. పరిశుద్ధాత్మ మర్మయుక్తంగా ఉంటుంది. దురాత్మపైకి భక్తినటిస్తూ అంతరంగంలో అపవాది ఆలోచనలు కలిగి ఉంటుంది. దీనిని చాలామంది భక్తిపరులు కూడా తొందరగా కనిపెట్టలేరు. ఇది అంత మోసకరమైనది.

## పరమతండ్రి ప్రేమనుండి ఏది, ఎవరూ వేరుచేయలేరు.

రోమా 8:35-39

**పల్లవి:** తుఫానులెన్ని నాపై పడినా
తుదకు నే నొంటరిగా మిగిలినా
నీ ప్రభావము కాకుండా
ఏ ప్రభావము పడకుండా
నన్ను నీ నీడలో ఉంచుమా!
నాకు నీవు తోడుగా ఉండుమా!.......................................... ॥తుఫాను॥

1. ప్రేమున్న చోట శత్రుత్వమొచ్చినా
ప్రియమైన వారే దూరమైపోతున్నా
మనసు నలిగిపోతున్నా
ఆత్మ కుమిలిపోతున్నా
నీ ప్రభావము కాకుండా
ఏ ప్రభావము పడకుండా
నన్ను నీ నీడలో ఉంచుమా!
నాకు నీవు తోడుగా ఉండుమా!.......................................... ॥తుఫాను॥

2. సమస్యల వలయములు ఎన్నున్నా
సంసార సాగరం ఈదలేకున్నా
సుఖము లేకున్నా
సంతోషం లేకున్నా
నీ ప్రభావము కాకుండా
ఏ ప్రభావము పడకుండా
నన్ను నీ నీడలో ఉంచుమా!
నాకు నీవు తోడుగా ఉండుమా!.......................................... ॥తుఫాను॥

3. స్నేహితులైనవారు శత్రుపక్షమున్నను
సత్యమునకు అవరోధం కలుగుచున్నను
సమస్యలు పెరుగుతున్నా
సముద్రము పొంగుతున్న
నీ ప్రభావము కాకుండా
ఏ ప్రభావము పడకుండా
నన్ను నీ నీడలో ఉంచుమా!
నాకు నీవు తోడుగా ఉండుమా!.......................................... ॥తుఫాను॥

4. దురాత్మ శక్తులెన్ని నన్ను ఆవరించినా
దుష్టులెందరో నాపై పోగుపడినా
వేదనలెన్నున్నా
శోధనలెన్నున్నా
నీ ప్రభావము కాకుండా
ఏ ప్రభావము పడకుండా
నన్ను నీ నీడలో ఉంచుమా!
నాకు నీవు తోడుగా ఉండుమా!.......................................... ॥తుఫాను॥

రచన, స్వరకల్పన : బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

# ఒంటరిగా ఉన్నావా? వెలివేయబడినావా?

బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

యోహాను సువార్త 9వ అధ్యాయంలో పుట్టు గ్రుడ్డివానిని గూర్చిన చరిత్ర అంతా మనకు తెలుసు. అతను గుడ్డివాడైయుండి యషువ మెస్సీయ ద్వారా చూపు పొంది శాస్త్రులు పరిశయ్యుల ద్వారా వెలివేయబడి ఆఖరికి కన్నతల్లిదండ్రులద్వారా కూడా కరుణ పొందని స్థితిలో ఉన్న చూపుగల వ్యక్తి. తన జీవితమునే మార్చిన వ్యక్తి యషువ మెస్సీయ. నా అనే వారు గాని, తల్లిదండ్రులు గాని, బంధుమిత్రులు గాని, ఆఖరికి ప్రార్థనపరుల్లా కనిపించిన శాస్త్రులు పరిశయ్యులు గాని ఎవరూ చేయలేని సహాయం అతడు యషువ మెస్సీయ ద్వారా పొందాడు. చూపులేనంతవరకు అందరినీ కలిగివుండి, చూపు రాగానే అందరిచేత దూషించబడి, ద్వేషించబడి, వెలివేయబడినవాడు యోహాను 9:34. కాని యషువ మెస్సీయకు తెలుసు, అతనే ఆయనకు పనికివస్తాడని: అందుకే యషువ మెస్సీయ అతనిని వెదుకుకుంటూ వెళ్లి అతనికి ఆయన అగపరచుకున్నాడు. అతనిని బలపరిచాడు, అతనిని లోకమునకు కనుపరచి పరిసయ్యులకు బుద్ధిచెప్పాడు.

పరమతండ్రిని ఆశ్రయించిన భక్తులందరూ ఒంటరివాళ్ళే. ఒంటరితనమనేది చాలామందికి యిష్టం ఉండదు. కాని బైబిల్లో పరమతండ్రిని నమ్మినవారందరూ ఏదో ఒక సమయంలో తండ్రి కొరకు ఒంటరిగా ఉండవలసి వచ్చింది. వారు ఆయన కొరకు ఒంటరితనమునే కోరుకున్నారు. ఒంటరిగానే ఉన్నారు. ఒంటరిగా ఉంటేనేగాని పరమతండ్రి వాళ్ళకు దొరకలేదు. మీరు ఒంటరిగా ఉంటున్నందుకు చింతిస్తున్నారా? సహవాసం లేదని బాధపడుతున్నారా? ఎవరూ మిమ్మును ఓదార్చడంలేదని కృంగిపోతున్నారా? అయితే మీరు చాలా పొరపాటులో ఉన్నట్టే. మీకోసం విజ్ఞాపన-ప్రార్థన చేసే ఒంటరివారు అనేకమంది ఉన్నారు. అందులో నేను ఒకరిని. నేను కూడా ఒంటరినే: నాకు అందరూ ఉన్నారు అయినా నేను మెస్సీయ కొరకు ఒంటరినే:

ఒంటరిని - నే ఒంటరిని
మెస్సీయ కోసం నేను ఒంటరిని
సంఘమున్నది - సహవాసమున్నది
సహోదరులున్నారు - సోదరీమణులున్నారు
అయినా నే ఒంటరినే
మెస్సీయ కోసం నేను ఒంటరిని ॥ఒంటరిని॥

అని అప్పుడప్పుడు పాడుకుంటూ ఉంటాను. నావారే బాధపడుతూ ఉంటారు. అయినా నేను ఒంటరినే అని నాకు తెలుసు. 25సం॥రాల క్రిందట చనిపోవాలని నిర్ణయించుకొని మెస్సీయ దగ్గరకు వచ్చిన వ్యక్తిని నేను. "నీవు చనిపోయావనే అనుకొని నాకోసం జీవించు" అని యషువ మెస్సీయ నన్ను జీవింపజేసి తీసుకువచ్చాడు. నాకు ఏమేమి అవసరమో, ఎవరెవరు అవసరమో, నేను ఏమేమి చేయాలో అన్నీ నాకు యిచ్చి పరిచర్యలో నడిపిస్తున్నాడు. ఒక్కసారి నా గతం గుర్తుచేసుకుంటే నేనాయన వద్దకు వచ్చినప్పుడు ఒంటరిని. ఇప్పుడు నేను కలిగి ఉన్నవన్నీ (వస్తురూపేణా) కలిగి ఉన్నవారంతా (వ్యక్తులుగా) యషువ మెస్సీయ ద్వారా నాకు లభించిన వారే. ఎన్ని ఉన్నా ఎందరు ఉన్నా నాకు-ఆయనకు ఉన్న సంబంధం అన్నిటికన్నా, అందరికన్నా మించినది. అంత అత్యవసరమైతే అన్నిటినీ, అందరినీ అయినా వదులుకుంటాను గాని యషువ మెస్సీయను వదులుకోను. ఎందుకంటే నాకు ఈ జీవితం ఇచ్చినదే ఆయన. అందుకే ఆయన కోసం నేను ఒంటరిగా నిలబడడానికైనా సిద్ధమే. సంఘాలు, సహవాసాలు, భక్తులు, వ్యక్తులు, ఆయనకు గాని ఆయన ప్రేమకు గాని, ఆయన త్యాగానికి గాని సాటిరారు. బైబిల్లో ఉన్న భక్తులను ఎవరిని చూసినా వారు ఎలోహీం కన్నా ఎవరినీ ఎక్కువగా ప్రేమించలేనట్లే కనిపిస్తుంది. ఏదైనా సమస్య వచ్చినప్పుడు, భక్తులు పరమతండ్రి చేతిలో పడడానికే ఇష్టపడ్డారు గాని మనుష్యుల చేతిలో పడడానికి ఇష్టపడలేదు. మీకా 7:7-11, 2సమూ 24:14-17, యోబు 16:1-22, 19:25,26. అయినా ప్రేమికులు (రోమా 8:28) ప్రేమనైనా, బాధనైనా ఒంటరిగానే భరించుకుంటారు. ఎలోహీంని ప్రేమించినవారు ఎలోహీం కొరకు ఒంటరిగా ఎదురుచూస్తూ ఉంటారు.

- నీ హస్తమును బట్టి నేను ఏకాకినై కూర్చుంటిని అని యిర్మీయా అంటున్నాడు.....................యిర్మీయా 15:17
- నేను ఉన్నాను, నన్ను పంపుము అని యెషయా అంటున్నాడు.........................................యెషయా 6:8
- నేను ఒకడను మాత్రమే మిగిలి యుండగా అని ఏలియా అంటున్నాడు........................1రాజులు 19:14
- మీకాయ అను ఒకడున్నాడు అని రాజు అంటున్నాడు............................................ 1రాజులు 22:8
- జనులతో బసచేయని భక్తుడొకడున్నాడని అంటున్నాడు........................................ 2సమూ 17:8
- ఏదో ఒక గుహలోనో, మరి ఏదో ఒక స్థలములోనో ఉంటాడని అంటున్నాడు.................. 2సమూ 17:9
- పరిస్థితులు ఎలా ఉన్నా ఆయన కొరకే ఎదురుచూస్తాను అంటున్నాడు ఒక ప్రవక్త............ మీకా 7:7-11
- ఆశలన్నీ ఆయన మీదే పెట్టుకుని బ్రతుకుతున్న మరియొక ప్రవక్త ఉన్నాడు.................... హబక్కూకు 3:17-19
- సింగిల్ గా భయపడి వెనుకకు తిరుగని సింహము, శోణంగి కుక్క, మేకపోతు, సైన్యమునకు ముందు నడచు రాజు మొ॥గు వారు ఉన్నారు....................................సామెతలు 30:30

సింగిల్‌గా ఎవరితోనూ మింగిల్ అవ్వకుండా ఉండడానికి గల కారణం మీకు తెలుసా? మీరు సింగిల్ (ఒంటరిగా) ఉంటేనే గాని మెస్సీయతో మీరు ఐక్యం కాలేరు, ఆయన జ్ఞానం మీరు పొందుకోలేరు, ఆయనతో మీరు సహవాసం చేయలేరు, ఆయనను మీరు ఏవిషయమూ అడగలేరు, ఏ సమస్యను పరిష్కరించుకోలేరు, సంతోషంగా ఉండలేరు, భక్తి సింగిల్‌గానే అలవర్చుకోవాలి. దేవాలయములలో దేవుడ్ని చూడాలనుకోవడం కాదు, మీ హృదయములలో మీరు ఆయనను చూపించగలగాలి. ఎలోహీం ఆత్మ-సాతానుకూడా ఆత్మయే. ఇద్దరూ కనపడరు. కాని ఇద్దరికీ మనుష్యులు (అంటే మనం) కావాలి. ఈ మనుష్యులలోనే, ఈ మనుష్యులతోనే వారిద్దరూ సహవాసం చేస్తూ ఉంటారు. అందుకే మన దేహమునే ఆయనకు ఆలయంగా చేసి మనం ఆయనకు లోబడాలి. అప్పుడు ఆయన మనలోకి వచ్చి మన ద్వారా తన కార్యాలు చేసుకుంటూ ఉంటాడు. ఈ మర్మం అర్ధంకాక గుడులు, గోపురాలు, అంటూ హస్తకృత ఆలయాలకు విశ్వాసులు ప్రాముఖ్యత ఇస్తున్నారు. అవి కేవలం మనం కూడుకొని ఆరాధన చేసుకోవడానికే గాని ఆయన అందులో ఉండడు. సమాజం అంటే సత్యమునకు స్తంభము ఆధారము 1తిమోతి 3:15, సమాజసభ్యులు సమాజకాపరి మేలు కోరేవారై యుండాలి (అ॥కార్య 12:5) గాని, సమాజమునే దొంగిలించెయ్యాలని ఆలోచనలు కలిగిన వారు నిజవిశ్వాసులు ఎలా అవుతారు? గనుక ఇవన్నీ మానవులు కల్పించుకున్న కుతంత్రములు, మోసకరమైన అభ్యాసములు.

ముందుగా వ్యక్తి వ్యక్తిత్వం కలిగి ఉండాలి. ఆ వ్యక్తి లేక వ్యక్తులు పరమతండ్రితో సహవాసం చెయ్యాలి. అలా సహవాసం చేసే వారితో కలిసి సహవాసం చేయడమే నిజమైన ఎలోహీం సమాజ సహవాసం అవుతుంది. అపోస్తులులనందరినీ ఒకే ఆత్మ నడిపించింది. వారు అందరూ కలిసి వారం వారం ఒకే ప్రదేశంలో సమాజంగా ఏమీ కూడుకోలేదు. కాని ఒకే ఆత్మ నడిపించింది గనుక వారి సిద్దాంతములు కూడా ఒకే విధంగా ఉన్నాయి. వాళ్ళనందరినీ పరిశుద్ధాత్మ నడిపించింది:

1. పేతురుని నడిపించింది...................................... అ॥కార్య 2:38
2. ఫిలిప్పుని నడిపించింది..................................... అ॥కార్య 8:38
3. అననీయను నడిపించింది.................................... అ॥కార్య 9:18
4. సౌలును నడిపించింది......................................... అ॥కార్య 16:33, 2కొరింథీ 12:18

పరమతండ్రి ఆత్మతో చేయించే కార్యక్రమములు పరమతండ్రి ఆత్మ ఉన్నవారికే అర్థం అవుతాయి గాని మానవుల ఆలోచనలను బట్టి కాదు.

- ఆదాము ఒంటరిగా ఉన్నాడు, పరమతండ్రి ఆయనకోసం చల్లపూట ఏదేను తోటకు వచ్చేవాడు.... ఆది 3:8
- నోవహు విషయంలోనూ అంతే.................................................................. ఆది 6:9, 7:1
- అబ్రాహాము కూడా ఒంటరిగా ఉన్నప్పుడే పిలవబడ్డాడు........................................ యెషయా 51:2
- యాకోబు ఒంటరిగా ఉన్నప్పుడే తండ్రితో పోరాటం జరిగింది................................. ఆది 32:24
- దానియేలు ఒంటరిగా ఉన్నప్పుడే దర్శనం చూసాడు.............................................. దానియేలు 10:7,8
- పత్మసు ద్వీపంలో యోహాను ఒంటరిగా ఉన్నప్పుడే ప్రకటన గ్రంథం వ్రాయగలిగాడు............ ప్రకటన
- ఒంటరిగా ఉన్న వ్యక్తి బలమైన పనిచేయడం.................................................... యెషయా 63:3
- అపోస్తులుడైన సౌలు పిలవబడినప్పుడు ఒంటరిగానే పిలవబడ్డాడు............................ అ॥కార్య
- కొన్ని బలమైన పనులు చేయవలసిన వారు ఒంటరిగానే ఉండాలి, తప్పదు...................... యోహాను 16:32
- వెయ్యిమందిని తరమాలంటే ఒంటరిగానే ఉండాలి............................................... ద్వితీ 32:30
- గొల్యాతులాంటి వార్ని కొట్టడానికి ఒంటరివాడే పనికివచ్చాడు................................. 1సమూ 17:46,47
- 400మంది అబద్ధ ప్రవక్తలకు సమాధానం చెప్పడానికి ఒక్క మీకాయయే పనికివచ్చాడు.......... 1రాజులు 22:8
- 450 బయలు ప్రవక్తలను సవాల్ చేయడానికి ఒక్క ఏలియాయే పనికివచ్చాడు........................1రాజులు 18:21-40
- ఆరులక్షల కాల్బలమును నడిపించడానికి ఒక్క మోషేయే పనికివచ్చాడు
- క్రొత్తనిబంధన పుస్తకములు ఎన్నో వ్రాయడానికి ఒక్క సౌలు మాత్రమే పనికివచ్చాడు
- ప్రపంచ పాపములను తీయడానికి ఒక్క యషువ మెస్సీయయే పనికివచ్చాడు.....................యోహాను 1:36
- కష్టసమయాల్లో కూడా అత్యవసరమైతే ఒంటరిగానే నిలబడవలసి వస్తుంది...................... 1సమూ 21:1
- బలాఢ్యులందరూ ఒంటరిగానే ఉంటారు. ..........................................................2సమూ 17:8,9
- యిర్మీయా కూడా పరమతండ్రికొరకు ఒంటరిగానే ఉన్నాడు..................................... యిర్మీయా 15:17
- డాష్ అండ్ డేరింగ్ ప్రోఫెట్ అయిన ఏలియాకి ఎంతోమంది శిష్యులు ఉన్నప్పటికీ ఎలీషా ఒక్కడే ఏలియాని ఎక్స్‌పోజ్ చేయగలిగాడు...............................................................................2రాజులు 2:15

ఒంటరిగానే ఉండాలి, నిషేధించిన రాయి తలకు మూలరాయి అయ్యినట్లు, మనుష్యుల ద్వారా నిషేధించబడినవారు, పరమతండ్రికి ఎంతో ఇష్టులు. పరమతండ్రితో సహవాసమునకు అలవాటుపడితే, మనుష్యుల ప్రేమపై ఆధారపడవలసింది ఉండదు. మనమే అనేకమందికి ప్రేమను పంచగలం, మనమే అనేకమందికి ఆశీర్వాదకరంగా ఉండగలం. మనమే ఒక చలనములేని నదిలా (కీర్త 46:4,5) ఉండగలం. మీ కడుపులోనుండి జీవజలనదులు (యోహాను 7:38) ప్రవహిస్తున్నప్పుడు మీకు దాహం ఏమిటి? మీరే అనేకమందికి దాహం తీర్చువారుగా ఉంటారు. అలాంటి దీవెనలు మీకు కావాలంటే మీరు తప్పక ఒంటరిగా ఉండాలి.

**- గోధుమ గింజ భూమిలోపడి చావకుండిన యెడల అది ఒంటిగానే యుండును. అది చచ్చిన యెడల విస్తారముగా ఫలించును. యోహాను 12:24**

# సాతానుడు ఎక్కడా మనశ్శాంతిగా ఉండనివ్వడు

- బ్రదర్ ఐజక్ ఇ. కుసుమ

ప్రతీ మనిషి శాంతి-సమాధానం కోరుకుంటూ సుఖజీవితం చేయాలని ప్రయాసపడతాడు. అందుకే అన్ని విధాల లోకంలో బాధపడుతూ తన కుటుంబాన్ని లేక తన వారిని సంతోషంగా ఉంచడం కొరకు నిరంతరం పాటుపడుతూ ఉంటాడు. సాతాను ఏ మనిషినీ కూడా వదలకుండా శాంతి-సమాధానం లేకుండా చేస్తూ ఉంటాడు. వాడి ప్రభావానికి లోనవ్వని వారు ఉండరు. ఒకవేళ వాడి ప్రభావానికి లోనవ్వకుండా జయిస్తే, వాడు మరోవిధంగా ప్రయత్నించి శాంతి-సమాధానం లేకుండా చేస్తాడు. సాతానుడు సహజంగా స్త్రీలనుండే (మరీ బలహీనమైన ఘటములు) ఎక్కువగా తన పనిని పూర్తిచేసుకుంటాడు. ఆదినుండీ వాడు స్త్రీనే వాడుకుంటున్నాడు. ఆది 3:1-3, 1తిమోతి 2:14,15. స్త్రీ నుండి సమాచారం రాబట్టుతాడు. ఒక బలమైనవాడ్ని బంధించాలంటే, వాడి బలహీనత ఏమిటో ముందు తెల్సుకుంటాడు. ఆ బలహీనతకు ఎవరు బలం పోస్తున్నారో చూస్తాడు. వాళ్ళ ద్వారా ఆ బలవంతుడ్ని బంధించి వాడు జయం పొంద ప్రయాసపడతాడు. బైబిల్లో సంసోనుని గూర్చి మనకందరికీ తెలుసు. అతను ఒక పని మీద పుట్టాడు. అతని జీవితానికి ఒక ప్రత్యేకత ఉంది. తండ్రి హస్తం, ఆత్మ అతనికి తోడుగా ఉంది. అతనిని బంధించడమంటే సాధ్యమయ్యే పని కాదని సాతానుకు తెలుసు. బలవంతుని మందుకు వెళ్ళి బంధించలేని పిరికి సాతాను, భార్య ద్వారా బంధించాలని చూసాడు. న్యాయాధి 14:15-19. తల్లిదండ్రులకు-స్నేహితులకు చెప్పని/చెప్పుకోలేని విషయాలు సహజంగా భార్యకు చెపుతాడు భర్త. దానిని అలుసుగా తీసుకునే భార్యలు భర్తలకు చాలా యిబ్బందికరంగా మారిపోతారు. భార్యయే భర్తగూర్చి చెడుగా చెప్పడం ప్రారంభిస్తే ఏ భర్త గౌరవంగా-మర్యాదగా సమాజంలో జీవించగలడు? అందుకే భార్యల దగ్గరే కాదు "నీ కౌగిటిలో పండుకొనియున్న దానియెదుట నీ పెదవుల ద్వారమునకు కాపుపెట్టుము" అని మీకా 7:5 వివరిస్తుంది. అంటే స్త్రీల విషయాలలో చాలా జాగ్రత్తగా ఉండాలని వాక్యం వివరిస్తుంది. స్త్రీలు ఎంత మంచిగా ఉంటారో అంత ప్రమాదకరమైన వ్యక్తులు అని ఋజువు అవ్వుతుంది. న్యాయాధి 14:16 చదవండి: నీ భర్తను లాలన చెయ్యి, లేకపోతే నిన్ను, నీ యింటివారిని యిలా చేస్తాము, అలా చేస్తాము అని బెదిరిస్తున్నారు శత్రువులు. మొత్తం మీద సంసోను భార్య అతని పాదాలదగ్గర పడి ఏడ్చి అతనిని అనేక విధాలుగా తొందరపెట్టి, ఏ విధం చేతనైతే నేమి అతని ద్వారా విప్పుడు కధకు భావం చెప్పించుకుని శత్రువులకు దానిని చెప్పింది. సంసోను కోపించి తన తండ్రి యింటికి వెళ్ళగానే ఆమె మరొకరికి భార్య అయ్యింది. సంసోనుని ఈమె ఎంత ప్రేమించింది? భార్యగా తన స్థానం కోల్పోయింది. ఇది సంసోనుకు ఒక ఎదురుదెబ్బ. అయినా సంసోను దానిని సవాల్‌గా తీసుకొని 300 నక్కలను పట్టుకొని ఫిలిష్తీయుల చేలను తగులబెట్టి వారిని (శత్రువులను) నాశనం చేసాడు. అతను పుట్టిందే అందుకుగదా! సాతాను దెబ్బ తగిలే కొలదీ, పరమతండ్రి బిడ్డలు బహుగా బలపడతారు గాని నీరుగారి నీరసంగా ఉండరు. సాతానుగాడి ప్లేనులు సాతానుగాడికి ఉంటే, పరమతండ్రియొక్క బిడ్డల ఉద్దేశ్యములు వారికి ఉంటాయి. అ॥కార్య 9:22, తండ్రి బిడ్డలు ఎప్పుడు బలహీనులో అప్పుడే బలవంతులు కూడా! 2సమూ 17:1-8,14.,

సంసోను అంటే ఒక బలాఢ్యుడు, ఇశ్రాయేలీయుల న్యాయాధిపతి: శరీరరీతిగా ఎంత బలాఢ్యుడైనా, ప్రతీ విషయానికి పరమతండ్రి సహాయం కోరుకునేవాడు (15:18). పరమతండ్రి యొక్క ఆత్మ కూడా అతనిని రేపుతూ అతనికి సహాయపడుతూ ఉండేది. 13:25, 14:4,6,19, 15:19, స్వయంకృతాపరాధం చేసుకొని చావాలని కోరుకున్నాడు (16:16) చచనిపోయేముందు అతను ఎవరో? ఎందుకు పుట్టాడో? అతను ఏమి చేస్తున్నాడో? ఎందుకు అతని బ్రతుకు అలా అయ్యిందో వివేకంతో గ్రహించుకున్నాడు. వెంటనే తనకి అర్థం అయ్యింది. ఏ పని నిమిత్తమైతే అతను పుట్టాడో, దానిని ఎలా నెరవేర్చాలో అనే దానిపై స్కెచ్ వేసుకున్నాడు. సాతాను చేతిలో ఓడిపోవడానికి ఇష్టంకాని సంసోను, సౌలురాజులా కత్తి తీసుకొని తనకు తానుగా చావలేదు, లేదా ఎవరినైనా చంపెయ్యండి నన్ను అని అర్థించలేదు. మరణంలో కూడా పిరికితనం లేని సంసోను, మానవబాంబుగా మారాడు, శత్రువులను సర్వనాశనం చేసాడు. తన బ్రతుకులో అంటే అతను బలములో ఉన్నప్పుడు, అతను అన్నీ కలిగి ఉన్నప్పుడు చేయలేనిపనిని చనిపోతూ ఫినిష్ చేసాడు (16:30). ఫిలిష్తీయుల సంబరం సంతాపంగా మారిపోయింది.

ఇక్కడ ఒక ముఖ్య విషయం గుర్తుంచుకోవలసింది ఏమంటే, సంసోను జీవితంలో సాతాను తనను మొదటినుండీ వెంటాడుతూనే ఉంది. పరమతండ్రి ఎవరినైతే ఎన్నుకుంటాడో, ఎవరిద్వారానైతే తన పనిని పూర్తి చేయాలని నిర్ణయించుకుంటాడో వారిని సాతాను వెంబడిస్తూ ఉంటాది. సంసోను జీవితంలో: భార్య ద్వారా ప్లేన్ చేసింది; గాజాలోని వేశ్య ద్వారా ప్లేన్ చేసింది 16:1-3, దెలీలా మేడమ్ ద్వారా సూపర్ ప్లేన్ చేసింది, అతను ఎవరిని ఆశ్రయిస్తే, వారి ద్వారానే అతనిని బంధించి నాశనం చేయచూచింది. అందుకే అతను కూడా ఎవరిద్వారానైతే నాశనం జరగబోతుందని తెలిసిందో వారి ద్వారానే అతను తన లక్ష్యాన్ని సాధించాడు.

- 300 నక్కలు ఫిలిష్తీయుల చేలు తగలబెట్టడానికి ఉపయోగపడ్డాయి (ఏ ఇశ్రాయేలీయుడు నక్కలు చేసిన పనిని చేయలేకపోయారు.) నక్కలు అంటే రాజకీయనాయకులు, అబద్దబోధకులు, అబద్ధాలను నమ్మే విశ్వాసులకు సాదృశ్యమై ఉన్నాయి. కొన్ని కొన్ని సార్లు మంచి పనులు చేయడానికి చెడ్డవారే ఉపయోగపడతారు. మహాగొప్ప భక్తి నటించేవారే చాలా ప్రమాదం (అ॥కార్య 13:50).

- దెలీలా ఫిలిష్తీయులనందరినీ సర్వనాశనం చేయడానికి ఉపయోగపడింది (ఇశ్రాయేలు స్త్రీలలో ఎవరూ సంసోనుకి సహాయపడలేకపోయారు) ఒక స్త్రీని చెడ్డదనీ, వేశ్య అనీ, నీచంగా మనుష్యులు మాట్లాడతారు. నిజానిజాలు ఏమిటో తెల్సుకోకుండా ఎలాంటి నిందలు మోపడానికైనా విశ్వాసులు కూడా వెనుకాడడం లేదు. కాని మహాపతివ్రతాశిరోమణుల్లా ప్రవర్తించే స్త్రీలకన్నా చెడ్డవారిగా, వేశ్యలుగా, మచ్చలు వేయించుకునే స్త్రీల వలనే పరమతండ్రికి పని జరిగింది. రాహాబనే వేశ్య, సమరయస్త్రీ, మొ॥గు స్త్రీలు కూడా పరమతండ్రి పనికి ఉపయోగపడ్డారు. రాహాబనే వేశ్య సంతాన వంశావళినుండే యషువ మెస్సీయ వచ్చాడు. సమరయస్త్రీ ద్వారా మొత్తం ఊరు ఊరంతా యషువ మెస్సీయను నమ్మారు.

ప్రతీ మగవాడి విజయం వెనుక ఒక మంచి స్త్రీ ఉంటుందని లోకోక్తి. వాస్తవంగా చెప్పాలంటే స్త్రీ (భార్య) పురుషునికి (భర్తకు) సాటియైన సహాయం. ఆమె మంచిదైనా, చెడ్డదైనా ఆమె మగవాడికి సాటియైన సహాయమే, మగవాడి విజయానికి కారకురాలే., నిజమైన ప్రేమికుడెవడైనా (భర్త ఎవడైనా) మేలు యందు మాత్రమే కాదు కీడును కూడా అనుభవిస్తాడు యోబు 2:10, ఎందుకంటే కీడు-మేలు అనునవి యావె నుండి మాత్రమే వస్తున్నాయి వి॥వాక్య 3:38., వెలుగు-అంధకారము ఆయన నుండే వస్తున్నాయి యెషయా 45:7., లాభము వస్తుంటే అందరూ అందరినీ ప్రేమిస్తారు, నష్టం వస్తుంటే తట్టుకోలేరు. కాని నిజమైన వ్యక్తులు: వారు స్నేహితులైనా, ప్రేమికులైనా, భర్తభార్యలైనా, ఇక ఏ బంధం కలిగిన వారైనా విడువక ప్రేమిస్తారు. (సామెతలు 17:17)

సాతాను ఎవరిని వదిలిన గాని, పరమతండ్రిచే ఎన్నుకోబడిన వారిని మాత్రం కడవరకూ వదలడు. అన్నిరకముల శోధనల నుండి వారిని శోధిస్తూనే ఉంటాడు. పుట్టుక దగ్గర నుండి మరణము వరకూ వాడు మనశ్శాంతి లేకుండా చేయడమే వాడి గురి. ఒక చిన్న ఉదాహరణ: - యోబు జీవితం మనం పరిశీలిస్తే, సర్వమూ పోగొట్టుకొని ఆఖరికి భార్య ద్వారా కూడా ఛీ అనిపించుకొని, చిల్లపెంకుతో శరీరమును గోక్కుంటూ బాధ అనుభవిస్తున్న సమయంలో కూడా సాతానుడు అతనిని శోధిస్తూనే ఉన్నాడు. ఈ వాక్యం చదవండి, యోబు 7:12-15. ఆఖరికి మంచం మీద కూడా నిద్రపోనివ్వడంలేదు. స్వప్నముల ద్వారా బెదిరించేస్తుంది, దర్శనములతో భయపెట్టేస్తుంది. చచ్చిపోతే మంచిది లేకపోతే ఉరితీసుకుంటే మంచిది అనే స్థితి వరకూ తీసుకుపోతుంది. చావు అనేది సాతాను. చంపాలనుకోవడం, చావాలనుకోవడం సాతాను ఆలోచన మాత్రమే. మనం చావడానికి కాదు, అనేకమందిని బ్రతికించడంకోసం జీవించాలి. అదేవిధంగా మోషే జీవితం చూడండి. మోషే పుట్టుకనుండీ సాతాను శోధిస్తూనే ఉంది. యషువ మెస్సీయ జీవితం పరిశీలించండి. పుట్టాడు అనగానే కలవరం మొదలయ్యింది. 2 సం॥రాల శిశువుగా ఉండగానే తీసివెయ్యాలని చూసింది. ఆఖరికి ఇస్కరియోతు యూదా ద్వారా దాని పని అది సాధించింది. కాని దానికంటె ముందే యషువ మెస్సీయ తను వచ్చిన పనిని పూర్తి చేసాడు యోహాను 13:2,3. పరమతండ్రి ఆలోచనలు కలిగిన వ్యక్తి ఎవరైనా పరమతండ్రి కొరకు చేయవలసిన పనులు చేసుకుంటూనే వెళ్ళిపోతాడు. అవసరమైతే పరమతండ్రి పని కొరకు అన్నీ ముందే సమకూర్చి ఉంచుతాడు. ఒక ప్రత్యేకమైన ఉదాహరణ ఏమంటే: దావీదు యావె ఆలయం కొరకు సమకూర్చిన సామాగ్రి. దానితోనే సొలొమోను యావెకు ఆలయం కట్టించాడు.

గనుక ప్రియ సహోదరుడా! సహోదరీ! సాతానుడు అన్నివేళలా మనలను వెంబడిస్తూనే ఉంటాడు. మనతోనే ఉండొచ్చు (యోబు 1:6) మనలోనే ఉండొచ్చు(మత్తయి 16:23) మనతో ఉన్నవారితోనే ఉండొచ్చు (యోహాను 13:26) లేక మనలను కనిపెట్టే ఏజంట్‌గా ఉండొచ్చు (యోహాను 18:2). వీడిని మాత్రం మనం చాలా జాగ్రత్తగా కనిపెట్టుకోవాలి.

# శోధన సహించుకో-జీవకిరీటము పొందుకో

బ్రదర్ సి.హెచ్. చంద్రశేఖర్, 99899 70579.

విశ్వాస జీవితంలో శోధన-వేదనలు సర్వసాధారనమైన విషయములు, శోధనలేని జీవితమంటు లేదు. అందరికీ శోధనలు ఉన్నాయి. కొందరికి ఎక్కువగాను మరికొందరికి కొంచెం తక్కువగాను ఉన్నవి. వాటిని అధిగమించడానికి అందరు ప్రయత్నిస్తారు. కాని అందరు సఫలీకృతులు కాలేకపోవుచున్నారు. అయితే శోధనను సహించుటే దానిని జయించుట అని వాక్యం తెలియజేస్తుంది.

**"శోధన సహించువాడు ధన్యుడు. అతడు శోధనకు నిలిచినవాడై సర్వాధికారి తన్ను ప్రేమించువారికి వాగ్దానము చేసిన జీవకిరీటము పొందును."** యాకోబు 1:12. ఈ యొక్క శోధనలు సాతాను విశ్వాసులను కీడు విషయమై పాపమునకు త్రోయుటకు శోధిస్తుంది. అయితే పరమతండ్రి అయిన ఎలోహీం కీడు విషయంలో శోధించడు. కాని మేలు కలుగుటకై నీతి విషయములో శోధించును. ఆదియందు సాతాను హవ్వ ఆదాములను పాపములో పడవేయుటకు యుక్తిగా మోసముతో శోధించాడు. అందువలన వారు దాని శోధనలో పడి పాపమునకు గురి అయినారు. వాళ్ళు అక్కడ పరమతండ్రి మాటకంటె సాతాను యొక్క కుటిల మాటలకే ఎక్కువ విలువనిచ్చి దాని మాటలు విని, దాని ప్రకారం నడవడం వలన వారు భయంకరమైన పాపములో పడిపోయినారు, మరణమును తెచ్చుకున్నారు, మనకు కూడా సంక్రమింపచేసారు. సాతాను ఇటువంటి కుతంత్రపు శోధనలను పరమతండ్రి విశ్వాసులపై ఎల్లప్పుడు ప్రయోగిస్తూనే ఉంటున్నది. సాతానుయొక్క శోధన చూచుటకు శోధనవలె ఉండదు. దానిలో ఎంతో ఆకర్షణ ఉన్నట్లుగా ఎంతో ఆనందంగా ఉన్నట్లుగా, ఎంతో లాభం ఉన్నట్లుగా చూపిస్తుంది కాని అది పరమతండ్రి నుండి వేరుచేసి అగ్నిగుండానికి నడిపిస్తుంది. ఇశ్రాయేలు సర్వసమాజము ఐగుప్తు నుండి ప్రయాణమై కనాను దేశము వచ్చే మార్గమధ్యలో సినాయి కొండ ప్రదేశమునకు వచ్చినప్పుడు ప్రవక్త అయిన మోషే సినాయి కొండపై నుండి వచ్చుట ఆలస్యమైనప్పుడు శోధకుడు వారి హృదయంలో ప్రవేశించి, వారిని అందరిని అక్కడ విగ్రహారాధనకు గురిచేసి, వ్యభిచారమునకు గురిచేసి, సణుగునకు గురిచేసి వారిని కానాను దేశము వెళ్ళకుండా హతము నొందుటకు కారణమైనది. (నిర్గమ 32:4, 1:6). అది పాపము చేయుటకు, తప్పు చేయుటకు హృదయమందు శోధన ప్రేరేపిస్తుంది. అది ఇప్పుడు కూడా అనేకమైన విశ్వాసుల హృదయములను శోధిస్తు సత్యమునుండి దూరము చేసి పాపమునకు దగ్గర చేసి దానియొక్క ప్రభావం లేనట్లుగా ఆరని అగ్నికి ఆహ్వానిస్తుంది.

**పరమతండ్రి అయిన యావె నీతి విషయములో మేలు కలుగుటకై శోధించును.** విశ్వాసమును పరీక్షించడానికి, పెంపొందించుకొనడానికి, నీతిని పరీక్షించడానికి పరిరక్షించుకొనడానికి, నమ్మకాన్ని పరీక్షించడానికి, నమ్మకం కోల్పోకుండా ఉండడానికి పరమతండ్రి తన విశ్వాసులను శోధించును. అబ్రాహామును ఎలోహీమైన యావె తనయందు గల భయభక్తుల విషయములో పరిశోధించెను. ఆ సంగతులు జరిగిన తరువాత ఎలోహీం అబ్రహామును పరిశోధించెను. (ఆది 22:1). ఈ యొక్క పరిశోధనలో అబ్రాహాము రక్తబంధునికంటె పరమతండ్రి సంబంధానికే ఎక్కువ విలువనిచ్చెను కనుక పరమతండ్రి ద్వారా ఆశీర్వదించబడినాడు. అబ్రాహాము పరమతండ్రియొక్క పరిశోధనలో విజయమొందెను గనుక ఆశీర్వాద కిరీటము తన తరువాయి తరములకు కూడా వర్తింపజేసెను.

**"అప్పుడు అబ్రాహాము తన కుమారుని వధించుటకు తన చెయ్యి చాపి కత్తి పట్టుకొనగా! యావె దూత పరలోకము నుండి - అబ్రాహామా అబ్రాహామా అని అతని పిలిచెను; అందుకతడు - చిత్తము సర్వాధికారి అనెను. అప్పుడు ఆయన - ఆ చిన్న వాని మీద చెయ్యి వేయకుము; అతని నేమియు చేయకుము; నీవు ఒక్కడైయున్న నీ కుమారుని నాకియ్య వెనుకతీయలేదు గనుక నీవు ఎలోహీంకు భయపడువాడవని యిందువలన నాకు కనబడుచున్నదనెను"** (ఆది 22:10-12). నేటికాలమందు కూడా సర్వాధికారియగు యషువ ఆయన విశ్వాసులను వాక్యంతోను, సత్యంతోను, ఆత్మతోను పరిశోధించుచున్నారు. ఈ యొక్క పరిశోధనలో అనేకమంది తమ రక్త బంధువులకు, స్నేహబంధులకు, దురభిమానాలకు, సుఖసంతోషములకు, లోభములకు, భోగములకు ఆశపడి, లొంగిపోయి, ఆయన ఆజ్ఞలను మీరిపోవుచూ, మనుష్యుల మెప్పును పొందుకొనుటకు ఆయన వాక్యంలోని సత్యకట్టడలను తృణీకరించుచుపడిపోవుచున్నారు. సర్వాధికారి కీడు విషయమై ఎవరిని శోధించడు. ఇస్సాకును బలి తీసికొని పరమతండ్రి అబ్రాహాముకు కీడు చేయడు. అతనియొక్క నీతిని కనిపెట్టి ఆయన ఇచ్చు ఆశీర్వాదములకు, సంతానాభివృద్ధికి యోగ్యుడా? కాడా? అర్హుడుడా? కాడా? అని తెలుసుకొనడానికి పరిశోధించును.

ఎలోహీం కీడు విషయమై శోధింపబడనేరడు (యాకోబు 1:13). సాతాను సర్వశక్తిమంతుని యొక్క విశ్వాసులను శోధిస్తాడు ఆయన ఆజ్ఞలను, కట్టడలను, నియామక కాలములను ఆచరించకుండా దానికి లొంగిపోయి పరమతండ్రికి విధేయులు కాకుండుటను చూసి ఈ లోక లాభములను ఎరవేస్తుంది అది సర్వాధికారియగు యషువ నొద్దకు వచ్చి - నీవు సాగిలపడి నాకు నమస్కారము చేసిన యెడల వీటినన్నిటిని (ఈలోక రాజ్యములన్నిటిని) నీకిచ్చెదనని ఆయనతో చెప్పెను (మత్తయి 4:9). అది పరలోక రాజ్యమార్గమును మరుగు చేసి ఈ లోకమును గూర్చి దానిలోని ఐశ్వర్యమును గూర్చి ఎల్లప్పుడు విశ్వాసులను దాని మత్తులో ముంచి వేస్తుంది. దీని శోధన నిజమైన విశ్వాసులను ఏమియు చేయలేదు. శోధన లేకుంటే నిజమైన భక్తి ఏమిటో తెలియదు, శోధన లేకుంటే నిజమైన విశ్వాసము ఏమిటో తెలియదు, శోధన వచ్చినప్పుడే నిజమైన విశ్వాసము, నిజమైన నమ్మకము బయలుపడుతుంది. యోసేపు తన అన్నల ద్వారా అమ్మివేయబడి పోతీఫర్ ఇంటికి తీసుకుని రాబడినప్పుడు అక్కడ యోసేపు నీతి యుక్తముగా జీవించుచుండగా పరమతండ్రి యావె ఆతనికి తోడై యున్నందున, పోతిఫర్ యోసేపును విచారణకర్తగా అతని యింటి మీద తనకు కలిగిన దానినంతటిని మీద నియమించిన తరువాత యోసేపునకు పోతీఫర్ భార్య ద్వారా శోధన ఎదురైనది. సాతాను పోతీఫర్ భార్య ద్వారా యోసేపును పాపమునకు గురిచేసి పరమతండ్రికి విరోధిని చేయాలని శోధించినది. కానీ యోసేపు పరమతండ్రిలో స్థిరముగా ఉన్నాడు కనుక నీతివిషయములో నిగ్రహం విషయములో పడిపోకుండా అపనింద అయినా, అవమానమైనా, అవహేళనూనా భరించినాడు. నీతికై చెరసాలలో బాధను భరించినాడు. కాని నేటి విశ్వాసుల పరిస్థితిని చూసినట్లయితే చాలా బాధాకరంగా నున్నది. అందితే అన్ని దోచుకుని, దాచుకోవాలని ప్రయత్నంలో ఉన్నారు. అవకాశములకై ఎదురుచూస్తున్నారు. యోసేపు వలె నిగ్రహముగా పరమతండ్రి నీతికై సాక్ష్యం చెప్పువారు కరువైయున్నారు.

యోసేపు పోతీఫర్ భార్యతో చెప్పుచున్న మాటలు-నీవు అతని భార్యవైనందున నిన్ను తప్ప మరి దేనిని నాకప్పగించియుండలేదు. కాబట్టి నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి ఎలోహీంకు విరోధముగా పాపము కట్టుకొందునా అని తన యజమానుని భార్యతో అనెను (ఆది 39:9). యోసేపు తన యజమాని యొక్క భార్య ద్వారా శోధింపబడకుంటే అతని నీతి, నిగ్రహము తెలిసి యుండేవి కావు. యోసేపు అన్యాయముగా చెరసాలలో వేయబడినందున పరమతండ్రి అత్యంత న్యాయముగా అత్యున్నత స్థానమును ఇచ్చినారు. ఆయనను నిజముగా ప్రేమించి నీతికి నిలిచేవారు ఎవరిచేతనైనను శోధింపబడిన, వేధింపబడిన అది వారికి మేలుగానే మార్పు చేయబడును. యోసేపు కేవలం ఒక యింటికి మాత్రమే విచారణకర్తగా ఉన్నప్పుడు అతనికి కీడు ఎదురై చెరసాలలో పడియుండిన తరువాత మొత్తం రాజ్యమునంతా పరిపాలించే సింహాసనముపై కూర్చుండి రాజ్యపరిపాలన చేసినాడు. పరమతండ్రి సంబంధులను కీడు చేయ శోధించిన యెడల అది మరింత మేలు జరుగునని తెలియుచున్నది. పోతీఫర్ భార్య యోసేపును శోధించి అతని స్థాయినీ స్థానమునను ఎంతో పెంచగలిగింది కాని తను ఆశించినట్లు పాపమునకు గురిచేయలేకపోయినది కనుక నీతికి నిలచినవాడే తుదకు గెలుచునని తెలియుచున్నది. యోసేపు పరమతండ్రిని సేవించువాడు కనుక అతనికి పరమతండ్రి జ్ఞానమును, వివేకమును అనుగ్రహించెను. ఆ వివేక జ్ఞానముల వలన కలలకు భావము చెప్పగలిగే శక్తిని కలిగియుండెను అందువలనే యోసేపు సింహాసనము ఎక్కగలిగినాడు. రాజు యోసేపును గూర్చి చెప్పిన మాటలు "ఆ మాట ఫరో దృష్టికిని అతని సమస్త సేవకుల దృష్టికిని యుక్తమైయుండెను గనుక అతడు తన సేవకులను చూచి ఇతని వలే ఎలోహీం ఆత్మ గల మనుష్యుని కనుగొనగలమా అని యనెను. మరియు ఫరో- ఎలోహీం ఇదంతయు నీకు తెలియపరచెను గనుక నీ వలె వివేకజ్ఞానములు గల వారెవరునూ లేరు. నీవు నా యింటికి అధికారివై యుండవలెను, నా ప్రజలందరు నీకు విధేయులై యుందురు; సింహాసన విషయములో మాత్రమే నేను నీకంటే పైవాడనై యుందునని యోసేపుతో చెప్పెను. మరియు ఫరో చూడుము, ఐగుప్తు దేశమంతటి మీద నిన్ను నియమించి యున్నానని యోసేపుతో చెప్పెను. మరియు ఫరో తన చేతినున్న తన ఉంగరము తీసి యోసేపు చేతిని పెట్టి సన్నపు నారబట్టలు అతనికి తొడిగించి, అతని మెడకు బంగారు గొలుసు వేసి, తన రెండవ రథము మీద అతని నెక్కించెను. అప్పుడు వందనములు చేయుడని అతని ముందర జనులు కేకలు వేసిరి. అట్లు ఐగుప్తు దేశమంతటి మీద అతని నియమించెను. (ఆది 41:37-43).

సాతాను యోబును శోధించుటకు, పరమతండ్రి నుండి వేరుపరచుటకు సెలవు పొంది ప్రయత్నించినది అయితే ఆ శోధన వలన యోబుకు మరింత మేలు జరిగినది కాని సాతాను ఓడిపోయినది. పరమతండ్రిలో నిజముగా ఉన్న విశ్వాసులందరూ సువర్ణమును పోలియున్నారు. వారిని అగ్ని పుటమనే శోధనలో వేసిన, వారు మరింత శుద్ధినొంది మెరయుచుందురని వాక్యము తెలియజేయుచున్నది. శోధింపబడి యోసేపు రాజ్య కిరీటము పొందుకొన్నలాగున మనము కూడా మనకు వచ్చు శోధనలను సహించుకొని జీవకిరీటము పొందుకొన్నలాగున మనము కూడా మనకు వచ్చు శోధనలను సహించుకొని జీవకిరీటము పొందుకొనెదము. పరిశుద్ధ గ్రంథమునందు దానియేలు, షద్రక్, మేషాక్, అబేద్నెగోలు ఇంకను అనేకమైన నిజమైన విశ్వాసవీరులు శోధన జయించి నీతికిరీటం పొందుకున్నారు. వారివలెనే శోధన సహించి జయించు వారమై యుండులాగున యషువ మెస్సీయ తనయందు మనలను అందరినీ ధైర్యముతో స్థిరపరచును గాక!

# మనుష్యుల సాక్ష్యము-ఎలోహీం సాక్ష్యము

**-అయితే యషువ అందరినీ ఎరిగినవాడు గనుక ఆయన తన్ను వారి వశము చేసికొనలేదు. ఆయన మనుష్యుని ఆంతర్యము ఎరిగినవాడు గనుక ఎవడును మనుష్యుని గూర్చి ఆయనకు సాక్ష్యమియ్యనక్కరలేదు.** యోహాను 2:24,25. మానవుడు మొదటి నుండీ అబద్ధికుడే. అబద్ధాలను సులభంగా నమ్మె మనస్తత్వం గలవాడు. ఎంతటి భక్తిపరుడైనా అబద్ధాలను నమ్మడం, అబద్ధాలు ఆడటం సహజమైపోయింది. హవ్వమ్మ సాతానుగాడి అబద్ధాన్ని నమ్మినంత సులువుగా పరమతండ్రియైన యావె మాట నమ్మలేదు. మానవుల దగ్గరున్న మరో నీచమైన స్వభావం ఏమంటే తప్పును ఎదుటివాళ్ళ మీదికి త్రోసి వాళ్ళంతట వాళ్ళు స్వనీతి ప్రదర్శించడం.

"నీవు తినకూడదని నేను నీ కాజ్ఞాపించిన ఫలవృక్షములను తింటివా?" అని పరమతండ్రి అడుగుతుంటే: తిన్నాను తండ్రీ! తప్పు/పొరపాటు/పాపం అయ్యింది అని ఒప్పుకోడానికి బదులు "నాతో నుండుటకు నీవు నాకిచ్చిన ఈ స్త్రీయే" అని హవ్వమ్మ మీదికి త్రోసి తన తప్పును కప్పుకుంటున్నాడు. ఇక హవ్వమ్మను అడిగితే సర్పము మీదికి త్రోసింది. నీ తమ్ముడైన హేబేలు ఎక్కడ ఉన్నాడని కయీనుని అడిగితే నా తమ్ముడికి నేనేమైనా కావలివాడనా? అని అబద్ధపు సమాధానం చెప్తున్నాడు కయీను. **"ప్రతి మనుష్యుడును అబద్ధికుడగును గాని ఎలోహీం సత్యవంతుడు కాకతీరడు."** రోమా 3:4. మనుష్యుల సమాధానం, మనుష్యుల సాక్ష్యం అబద్ధాలతో నిండి ఉంటుంది. గనుకనే మెస్సీయకు మనుష్యుల సాక్ష్యము అవసరం లేకుండా ఉంది. ఆయన మనుష్యుల ఆంతర్యము ఎరిగినవాడు. నిజమనేది ఆయనకు తెలుసు గనుక సత్యసంబంధులు సత్యవంతుడైన మెస్సీయ సాక్ష్యం కోసమే ఎదురు చూడాలి గాని మనుష్యుల సాక్ష్యం కోసం కాదు.

- న్యాయాధిపతులు, న్యాయం తీర్చవలసినవారు సహితం మనుష్యుల తప్పుడు సాక్ష్యములను బట్టి నిర్దోషులను దోషులుగా ఎంచి శిక్షించడం జరిగింది, జరుగుతుంది.

1. **నాబోతును** (1రాజులు 21:7-13) చంపించిన యెజెబేలు మనుష్యులను అబద్ధ సాక్ష్యానికి పురికొల్పి చంపించింది.
2. **మెస్సీయను** (మత్తయి 26:59-62, 65-67, 27:22-26) చంపించిన ప్రధానయాజకులు, శాస్త్రులు, పెద్దలు అబద్ధ సాక్ష్యాలతోనే జయించారు. న్యాయాధిపతికి అది తప్పు అని తెలిసినా ప్రజలకి జడిసి తప్పుడు తీర్పు చెప్పాడు.
3. **సౌలు గారిపై** (అ॥కార్య 25:7) భారమైన నేరములెన్నో మోపి, వాటిని ఋజువు చేయలేకపోయినా అన్యాయంగా చంపబడ్డాడు.
4. **స్తెఫనుని** చంపినవారు (అ॥కార్య 6:11-14) భక్తిపరులు, నీతివేషం ధరించినవారు, వారూ అబద్ధాలతోనే చంపగలిగారు.

భక్తిహీనులు పుట్టుకతోనే అబద్ధాలాడతారని బైబిలు చెపుతుంది. (కీర్తనలు 57:3) అబద్ధాలు ఆడటమే సాతానుగాడి మొట్టమొదటి లక్షణం, **సాతాను అబద్ధికుడు, అబద్ధాలకు జనకుడు. (యోహాను 8:44)**

నేను 17 సం॥ల నుండి భక్తి మార్గంలో ఉన్నాను. పాపపు జీవితం నుండి మరలి భక్తిమార్గంలోకి వస్తే లోకస్తులకన్నా హీనమైన/నీచమైన అబద్ధికులను క్రైస్తవుల్లో నేను చూసాను. బోధ అబద్ధం, బ్రతుకు అబద్ధం, క్రియలు అబద్ధం, పైగా నీతిగా బ్రతికే వాళ్ళను అబద్ధికులుగా సమాజంలోనమ్మింపచూస్తారు. ఈ 17సం॥రాల జీవితంలో నిజం చెప్పే ఒక్క బోధకుడ్ని నేను చూడలేదు. మనుష్యులు లేనిపోని మాటలు, అబద్ధాలు, నిందలు వేస్తూ ఉంటే బాధపడేవాడిని. తదుపరి వాక్యంతో బహుబలంగా స్థిరపడ్డాక ఈ చెత్త మనుష్యుల సాక్ష్యం కోసం ప్రాకులాడటం తప్పు అని తెలుసుకున్నాను. పెడితే పెళ్ళి లేకపోతే చావుకోరే మనుష్యుని సాక్ష్యం పరలోకానికి పనికిరాదు.

ఓపాఠకుడా/పాఠకురాలా, ఈ చెత్త మనుష్యుల సాక్ష్యం కోసం ప్రాకులాడక పరమతండ్రి నీకోసం యిచ్చే సాక్ష్యం కోసం ప్రయాసపడు. నీ అంతరంగం ఆయనకు తెలుసు గాని మానవునికి కాదే: పైరూపాన్ని చూసేవాడు పరమతండ్రి (1సమూ 16:7) కళ్ళతో చూసినదంతా నిజం కాదు. (1సమూ 1:13,14) మనుష్యుల ఊహలు సాక్ష్యాలు అంతకన్నా నిజం కాదు (ఆది 37:31-35) "సత్యమైనది దూరముగాను బహులోతుగాను ఉన్నది, దాని పరిశీలన చేయగలవాడెవడు?" ప్రసంగి 7:24 జ్ఞానములేనివాడు ప్రతిమాట నమ్మును. సామెతలు 14:15 ద్విభాషి (ఆది 42:23) సత్యాన్ని గ్రహిస్తాడు. పరిశుద్ధాత్మ ఉన్నవారికి నిజం తెలుస్తుంది. (అ॥కార్య 5:3) అంతరంగంలో ఉన్నది ఆత్మ ఉన్న వానికే అర్థమౌతాయి. (లూకా 7:39-50). కళ్ళతో చూడలేకపోయినా ఆత్మలో వివేచించగలిగే వానికి నిజం తెలుస్తుంది. (1రాజులు 14:4-7) ఉడత ఊపులకు చింతకాయలు రాలవన్నట్లే మనుష్యుల చెడు సాక్ష్యాలవల్ల సత్యసంబంధికి పోయేది ఏమీ ఉండదు. యోసేపుని రాజ్యమంతా దండోరా వెయ్యించారు మనుష్యులు కాని, యోసేపు మాత్రమే సత్యవంతుడని ఋజువయ్యాడు, కడకు రాజయ్యాడు. గనుక బైబిల్లో ఎక్కడ చూసినా పరమతండ్రి బిడ్డలకు యిబ్బందులు, ఇరుకులు ఉంటాయి. కాని జయం మాత్రం వారిదే, సాతాను చెడు ప్రచారం చెయ్యగలదేమో గాని చెడును ఋజువు చెయ్యలేదు. (అ॥కార్య 25:7) అబద్ధాలతో యుద్ధం చెయ్యగలదేమో గాని జయం మాత్రం పొందలేదు. (యిర్మీయా 15:20) గనుక మనుష్యులకోసం వారి అబద్ధపు ప్రచారం, వారి అబద్ధపు సాక్ష్యములకోసం భయపడకండి. (యెషయా 51:12,13) నేనైతే ఎంత చెడుగా ప్రచారం చేయబడ్డానో అంతకన్నా రెట్టింపుగా ఆయనలో ఎదగగలిగాను అందుకే నా శత్రువులకోసం నేను ప్రార్థన చేస్తూ ఉంటాను. తండ్రీ! వీరేమి చేయుచున్నారో వీరికి తెలియదు (అబద్ధాలను ప్రచారం చేసేవారికి నిజం తెలియదు గదా!) గనుక వీరిని క్షమించుమని ప్రార్థించాలి. మనుష్యుల సంగతులను తలంచడమే దయ్యపుపని (మత్తయి 17:23) మెస్సీయను నమ్ముకున్న మనమైతే ఆయన సాక్ష్యం కోసం, ఆయన తీర్పు కోసం ఎదురుచూద్దాం. మెస్సీయ అట్టి మంచి ఆత్మ మనకు దయచేయును గాక! షలోం.

బ్రదర్ సి.హెచ్. చంద్రశేఖర్, 99899 70579.

**కంటి చూపును బట్టి ఆయన తీర్పు తీర్చడు**
**తాను వినుదానిని బట్టి విమర్శ చేయడు**
**నీతిని బట్టి బీదలకు తీర్పు తీర్చును**

యెషయా 11:4

# నిజమైన ప్రేమ

బ్రదర్ సి.హెచ్. చంద్రశేఖర్, 99899 70579.

**“నిజమైన స్నేహితుడు విడువక ప్రేమించును”** – సామెతలు 17:17. మనకు నిజమైన స్నేహితుడు, రక్షకుడు మెస్సీయ కనుక ఆయన మనలను విడువకుండా ప్రేమిస్తున్నారు. కాని ఈనాటి క్రైస్తవ ప్రపంచానికి ప్రేమ అంటే ఏమిటో తెలియడం లేదు. లోక సంబంధమైన ప్రేమ నిజమైన ప్రేమ అనుకుంటున్నారు కాని వాక్యానుసారముగా ఉన్న ప్రేమ ఏమిటో తెలియడం లేదు.

**“మనమాయన ఆజ్ఞల ప్రకారం నడుచుటయే ప్రేమ”** 2యోహాను 1:6. ప్రస్తుత బోధకులు అసలు ఆజ్ఞలే లేవు అని అనుకుంటున్నారు అంటే వీరికి ఆయనపైన ప్రేమలేదనే అర్థం అవుతుంది. ఆయన చెప్పిన దానిని చేసేవాడే ఆయనను ప్రేమించువాడు. ఒకసారి యషువ సీమోను పేతురును–వీరికంటె నీవు నన్ను ఎక్కువగా ప్రేమించుచున్నావా? అని అడిగెను. యోహాను 21:15–18. ముమ్మారు అదే ప్రశ్న అడిగితే పేతురు చివరిగా వ్యసనపడి సర్వాధికారి, నీవు సమస్తమును ఎరిగినవాడవు, నిన్ను ప్రేమించుచున్నానని నీవే యెరుగుదువని ఆయనతో చెప్పెను. కొందరు ప్రేమ లేకపోయినను నటించెదరు. ఇస్కరియెతు యూదా ముద్దుపెట్టుకొని మెస్సీయను అప్పగించెను. ఇది పేతురుకున్నటువంటి ప్రేమ కాదు. ఇది లోక సంపాదనకై ఆయనను ప్రేమిస్తున్నట్లు, హత్తుకున్నట్లు, ముద్దుపెట్టుకొని ఆయన ఆజ్ఞలను లోకానికి అప్పగించుచున్నారు. ఎందుకంటె వారు లోకమును ప్రేమించువారు గనుక ఆయన ప్రేమ వారిలో ఉండదు. **“ఈ లోకమునైనను ఈ లోకములో ఉన్నవాటినైనను ప్రేమింపకుడి. ఎవడైనను లోకమును ప్రేమించిన యెడల తండ్రి ప్రేమ వానిలో నుండదు”** 1యోహాను 2:15. లోకమును ప్రేమించేవారు ఎవరైనను వారిలో తండ్రి ప్రేమ ఉండదు. అంటే తండ్రి ఆజ్ఞలు వారిలో ఉండవు. ఎవరైతే ఆయన ఆజ్ఞలను పాటించడం లేదో వారు లోక సంబంధులని, లోకమును ప్రేమించువారని తెలియుచున్నది. ఆయనను ప్రేమిస్తున్నామని చెప్పుచూ ఆయన ఆజ్ఞలను గైకొనకుంటే ఆయనను దేని ద్వారా ప్రేమిస్తున్నామని చెప్పగలము. “ఒక మనుష్యునికి ఇద్దరు కుమారులుండిరి. అతడు మొదటి వానియొద్దకు వచ్చి, కుమారుడా, నేను పోయి ద్రాక్షతోటలో పనిచేయుమని చెప్పగా, వాడు పోను అని యుత్తరమిచ్చెను గాని పిమ్మట మనస్సు మార్చుకొని పోయెను. అతడు రెండవ వాని యొద్దకు వచ్చి ఆ ప్రకారమే చెప్పగా వాడు–అయ్యా పోదుననెను గాని పోలేదు. ఈ యిద్దరిలో ఎవడు తండ్రి యిష్టప్రకారం చేసినవాడని వారినడిగెను. అందుకు వారు మొదటివాడే అనిరి. మత్తయి 21:28–30. కనుక ప్రియులారా! ఆయన ఆజ్ఞాపించినదానిని అనుసరించి నడుస్తున్నారు అంటే ఆయనపై ప్రేమ, అభిమానం ఉన్నట్లు. మొదటి కుమారునికి తన తండ్రి మాటపై గౌరవం, అభిమానం, ప్రేమ ఉన్నది. కనుక చెప్పిన దానిని చేసెను. కాని నేటి జనులు రెండవ కుమారుని పోలియున్నారు. చెప్పిన వెంటనే అంగీకరించి నమ్మకం కలిగిస్తారు కాని వారు చెయ్యరు. రెండవ కుమారుని జవాబు చాలా అంగీకారంగా ఉంది. కాని క్రియలు లేవు. పరమతండ్రికి చెప్పేవారు కాదు చేసేవారు కావాలి.

ఆయన మనపై భారమైనవాటిని మోపడం లేదు. **“మనమాయన ఆజ్ఞలను గైకొనుటయే ఎలోహీంను ప్రేమించుట ఆయన ఆజ్ఞలు భారమైనవి కావు”** 1యోహాను 5:3. ఆయన కార్యం తప్ప ఈ భూమిపై ఏ ఇతర కార్యము గొప్పది కాదు. ప్రాముఖ్యమైనది కాదు, ప్రత్యేకమైనది కాదు, ఆయనను నిజముగా ప్రేమించి ఆయనను హత్తుకున్నప్పుడు ఆయన ఆజ్ఞలను మనం గైకొనగలము. నేడు కొందరు ఉపదేశకులు చెప్పుచున్నారు. ఆజ్ఞలు ఏమిలేవు. కేవలం నమ్మకముంటే చాలు అని. కాని ఆజ్ఞలు ఉన్నాయి. నిత్యజీవం పొందుటకు అవే ఆధారము.

ఇదిగో ఒకప్పుడు ధర్మశాస్త్రోపదేశకుడు లేచి బోధకుడా! నిత్యజీవమునకు వారసుడనగుటకు నేనేమి చేయవలెనని ఆయనను శోధించి అడిగెను. అందుకాయన ధర్మశాస్త్రమందేమి వ్రాయబడియున్నది? ఏమి చదువుచున్నావని అతని నడుగగా! అతడు నీ పూర్ణశక్తితోను, నీ పూర్ణ వివేకముతోను ప్రేమింపవలెననియు, నిన్ను వలె నీ పొరుగు వాని ప్రేమింపవలెననియు వ్రాయబడియున్నదని చెప్పెను” లూకా 10:25–28. నిత్యజీవం పొందాలి అంటే పూర్ణహృదయంతో ప్రేమించాలి. కొన్ని కొన్ని విషయాలలో ప్రేమించకపోవడం, ద్వేషించడం మానివేయాలి. పూర్ణహృదయంతో ప్రేమించాలి ఇది ధర్మశాస్త్రంలో మొదటి ఆజ్ఞ. ప్రధానమైన ఆజ్ఞ మార్కు 12:30,31. ఇప్పుడు ఈ ఆజ్ఞలే లేవు. ఈ గ్రంథమే లేదు అని ప్రేమ అంటే (ఆజ్ఞలంటే) తెలియని ద్వేషకులు, అబద్ధికులు చెప్పుచున్నారు. ప్రేమ అంటే కేవలం మనుష్యులను నమ్మించేది అని, కేవలం పరస్పరం సహకరించుకొనేదని తలంచుచున్నారు. కాని ప్రేమ అంటే పరమతండ్రి చెప్పిన వాటిని చెయ్యడం అని తెలుసుకొనలేకపోతున్నారు. ఒకడు తండ్రి ఆజ్ఞలను గైకొనకుండా వేరొకరిని ప్రేమతో సహకరించినను అది అతనిని రక్షించదు ఎందుకంటే **“తండ్రినైనను తల్లినైనను నాకంటే ఎక్కువగా ప్రేమించువాడు నాకు పాత్రుడు కాడు:”** మత్తయి 10:37. అందరికంటె ఎక్కువగా ఆయననే ప్రేమించాలి. అంటే ఆయన చెప్పినవి, ఆయన పని అందరికంటె అన్నిటికంటె, ప్రాధానమైనవిగా గుర్తించి వాటికి మొదటి స్థానమును ఇచ్చి, అన్నిటికంటె ఆయనే ముఖ్యమని చెప్పి, ఆయన కొరకై జీవితాలను, ప్రాణాలను అర్పించి నిజమైన ప్రేమకు సాక్షులుగా నిలిచిన నిజమైన ప్రేమికులను ఇప్పుడు ఉన్నవారితో పోల్చి చూస్తే అబద్ధికులు కేవలం స్వార్థపరులని, ఆయనంటే ప్రేమలేనివారని, ఆయన కార్యము చేయడానికి ఎంత మాత్రము సాహసం చేయలేనివారని తెలియును.

**1. స్తెఫను:** ముఖ్య ప్రసంగికుడు కాడు. సువార్తికుడు కాడు, కేవలం ఆహారమును పంచిపెట్టేవాడు ఆత్మతో, జ్ఞానముతో నిండుకున్నవాడు (అ॥కార్య 6:2,5) ఇతడు కృపతోను, బలముతోను నిండుకొని ఐదు సమాజముల వారిని ఎదిరించి బహుబలమైన వాక్యములను ఎత్తి మీరు యావె దూతల ద్వారా నియమింపబడిన ధర్మశాస్త్రమును మీరు పొందితిరి గాని దానిని గైకొనలేదని బహు ధైర్యముగా చెప్పేను(అ॥కార్య 6:8–16, 7:1–60). రాళ్ళతో కొడుతున్నా సహించి ఆయన ప్రేమను నిజముగా కనుకరించిన స్తెఫను మొదటి హతసాక్షి, నిజమైన ప్రేమికుడు.

**2. సౌలు:** సౌలు సత్యములోనికి మార్చబడిన తరువాత మెస్సీయను గూర్చి సాక్ష్యమిచ్చునప్పుడు అనేక హింసలు ఎదురైనవి అయినప్పటికీ వాటిని ఆయన కొరకు సహించి ఆయన సాక్ష్యమును ప్రకటించెను. అంతియెకయలో సౌలునకు బర్నబాకు హింస కలుగజేసి వారిని తమ ప్రాంతములనుండి వెళ్ళగొట్టిరి (అ॥కార్య 13:50) అంతియొకయ నుండి, ఈకోనియ నుండియు యూదులు వచ్చి సౌలు మీద రాళ్ళు రువ్వి అతడు చనిపోయెనని అనుకొని, పట్టణము వెలుపలికి ఈడ్చిరి (అ॥కార్య 14:19). సౌలు సీలను ఈడ్చుకొని పోయి చాలా దెబ్బలు కొట్టి వారిని చెరసాలలో వేసి భద్రముగా వారి కాళ్ళకు బొండవేసి బిగించేను (అ॥కార్య 16:19,23,24). సౌలు మరి ఎన్నో హింసలు, శ్రమలు పొంది, మంచి పోరాటం పోరాడి నిజమైన ప్రేమను కనుపరచి నిరో చక్రవర్తి కాలములో శిరచ్ఛేదనము చేయబడియుండెను. వీళ్ళది నిజమైన ప్రేమ ప్రస్తుతం ఉన్న వారిది నటనతో కూడిన ప్రేమ.

**3. అంద్రెయ:** ఇతడు మత్తయి 4:18 మరియు యోహాను 1:40,41 నందు ఉన్న శిష్యుడు. అనేకసార్లు జైలు శిక్షకు గురియై ఎన్నోసార్లు రాళ్ళతో కొట్టబడినవాడు. ఇతనిని × ఆకారంలో మ్రానుకు కట్టి చంపినారని చరిత్ర తెలియజేయుచున్నది. మెస్సీయ కొరకు తన ప్రాణము తుచ్ఛమైనదిగా ఎంచుకొన్నాడు. ఇతడే నిజమైన ప్రేమను కనుపరచినాడు.

**4. ఫిలిప్పు :** యోహాను 1:43, అ॥కార్య 8:29, ఇతనిని చూడవచ్చు, ఆయన శిష్యులలో ఒకడు. ఫిలిప్పు సర్పరాధికులకు మెస్సీయను ప్రకటించినందుకు వారు కొరడాలతో కొట్టి, చెరసాలలో వేసి, మ్రానుకు వ్రేలాడదీసి రాళ్ళతో కొట్టి చంపిరి. వీరి ప్రేమ సమస్తమును ఆయన కొరకు అర్పించినది నేడు ప్రేమ పేరుతో సమస్తమును దోచుకొనుచున్నారు.

**5. మత్తయి :** మార్కు 3:18, అ॥కార్య 1:13 నందు ఉన్న ఒకడు. ఆయన శ్రమలు పొంది మెస్సీయను ప్రకటించి చివరకు హతసాక్షిగా మారెనని చరిత్ర తెలియజేయుచున్నది.

**6. బర్తోలోమయి :** (నతానియేలు) ఈయన శిష్యులలో ఒకడు. మత్తయి 10:2, మార్కు 3:18, లూకా 6:14, యోహాను 1:45,48, అ॥కార్య 1:13. ఇతను మరీ దారుణంగా బ్రతికియుండగానే చర్మము ఒలిచి తలక్రిందులుగా మ్రాను వేసినారు. ఇతను మెస్సీయ పరిశుద్ధ నామము నిమిత్తము ఎంతగా సహించుకొని, ఓర్చుకొని తన యందు నిజమైన ప్రేమను కనపరచేను. వీళ్ళు అసలైన సేవకులు.

**7. పేతురు :** ఎన్నో శ్రమలను అనుభవించినవాడు. ఆయన కార్యమునకు అందరికంటె ముందుగా దూకుడుగా వచ్చేవాడు. ఎంతో ప్రయాసపడి ఆయన నామమును ప్రకటించినవాడు. అనేక హింసలు పొంది మరణించినట్లు తెలియుచున్నది. ఆయనను నిజముగా ప్రేమించినవాళ్ళు ఎందరో ఆయనకై తమ ప్రాణములను ఎంతో తేలికగా ఇచ్చినారు.

**8. యాకోబు:** ఇతడు యోహాను సహోదరుడు అ॥కార్య 12:2, మార్కు 10:41. ఇతడు అనేక శ్రమలు పొంది ఆయన నామమును ప్రకటించి మరణ సమయంలో ఎంతో సంతోషముగా ఉండగా తరువాత అతనిని శిరచ్ఛేదన చేసినారని తెలియుచున్నది. మెస్సీయ సహోదరుడైన యాకోబు ఇతను మెస్సీయ మరణ అనంతరము సువార్త పరిచర్యలోకి వచ్చెను. ఎన్నో శ్రమలను అనుభవించెననియు, ఆలయ శిఖరములనుండి క్రిందకు త్రోసివేసి రాళ్ళతో కొట్టి చంపిరని తెలియుచున్నది. వీరి మరణ సాక్ష్యములను బట్టి వీరి ప్రేమ ఎంతో బలమైనదో ఎంతో నిజమైనదో తెలియుచున్నది.

**9. తద్దయియను యూదా :** ఇతను 12 మంది శిష్యులలో ఒకడు యోహాను 14:12. ఇతడును ఎన్నో శ్రమలను అనుభవించినట్లు తెలియుచున్నది. విగ్రహారాధికులు ఇతనిని బల్లెముతో పొడిచి చంపిరని తెలియుచున్నది. వీళ్ళు నిజమైన ప్రేమకై మరణ సాక్షులు.

**10. కనానీయుడైన సీమోను :** ఇతనిని మత్తయి 10:4లో, మార్కు 3:18లో చూడవచ్చు. ఇతడు ఎన్నో ప్రదేశములు తిరిగి సువార్త ప్రకటించి పారశీకదేశము నందు అంపముతో కోయబడి చంపబడెను. మెస్సీయ సువార్త సేవకై వీరి ప్రాణమును అర్పించినారు.

**11. తోమా :** మెస్సీయ 12మంది శిష్యులలో ఒకడు. ఇతడు ఆధారములతోను అన్నింటిని నమ్మెడివాడు. యోహాను 20:27, సువార్త పరిచర్య ప్రయాణములో ఇండియా దేశములో మద్రాసులో మైలాపూర్‌లో విగ్రహారాధికులు తోమాను బల్లెముతో పొడిచి చంపిరని తెలియుచున్నది. వీరియొక్క త్యాగమును, ధైర్యమును చూసి మెస్సీయకై మనం కూడా బలమైన గొప్ప కార్యములు చేయాలి అని తెలుసుకొనవలెను.

**12. యోహాను :** మెస్సీయను వెంబడించిన యోహాను 1:40, మార్కు 9:38. ఇతను అనేక శ్రమలను అనుభవించెను. మండుచున్న నూనెలో వేసినా ఎమియూ కలుగలేదు. ఎన్నో ప్రాంతములు తిరిగి మెస్సీయను ప్రకటించెను.

ఆయనయొక్క శిష్యులు శ్రమలను, కష్టములను గుర్తెరిగి ఎందరో క్రైస్తవ బోధకులు మారుమనస్సు పొందవలసిన అవసరం ఉంది. ఆయనవారు తమ ప్రాణములనే ఎంతో ఆనందముతో ఆయనకై అర్పించినారు. నేటి బోధకులు ఆయన సత్యమునే అంగీకరించలేకపోతున్నారు. యేసు కాదు యషువ అంటేనే అంగీకరించలేకపోతున్నారు. వీళ్ళు ఇంకేమి ఆయనకు ఇవ్వగలరు? ఆదివారం ఆరాధనను వదిలి రమ్మంటే రాలేరు. నిజముగా ఆయనను ప్రేమిస్తున్నారా? శిష్యులు నీతికై మరణించినారు. వీళ్ళ అసత్యబోధను మార్చుకొనమంటే మారుమనస్సు నొందని వీళ్ళు ఆయనను ప్రేమించువారు కాదు. అపోస్తులులు మరణించినది ఆయన నిజమైన పరిశుద్ధమైన యషువ మెస్సీయ నామము కొరకు, విశ్రాంతి దినము కొరకు, ఆయన ఆజ్ఞల కొరకు గాని నేటి క్రైస్తవ ఆచారముల కొరకు, ఆదివారపు ఆరాధన కొరకు కాదు. హతసాక్షుల మరణాలను స్మరించుకొని ఆయన సత్యమునకై ధైర్యముగా నిలిచేవారిగా ఉండాలి. నిజమైన ప్రేమతో ప్రేమించండి ఆయన నీతిని ప్రకటించండి.

**“అగాధ సముద్రజలము ప్రేమను ఆర్పజాలదు. నదీ ప్రవాహములు దాని ముంచివేయజాలవు” పరమగీతము 8:7,** కనుక నిజముగా ఆయనను ప్రేమించేవారు వేరుగా ఉంటారు. ఆయన కొరకై నిలబడతారు. కనుక అసత్యమునుండి బయటకు వచ్చి నిజమైన ప్రేమతో సత్యంలో నీతిగా నిలవండి. అట్టి హృదయమును, ధైర్యమును మెస్సీయ మీకు అనుగ్రహించును గాక!

# ప్రింటింగ్ స్పాన్సర్స్ కావలెను

ప్రియ పాఠకులకు షలోం. ఇదివరకు మనం ప్రింట్ చేసిన చిన్న కరపత్రములు చాలా చక్కగా ప్రజలలో పనిచేసినవి. వాటి ద్వారా అనేకమంది సత్యసంబంధులైన విశ్వాసులు, బోధకులు ఎంతో బలపడ్డారు, స్థిరపరచబడ్డారు. అంతేకాకుండా అనేకమందికి బహుబలమైన వాక్యం అందించే వారిగా అనుభవము సంపాదించారు. ఆఖరికి వారి బైబిళ్లలో ప్రసంగదీపికల్లా మన పత్రికలు ఉపయోగించుకుంటున్నారు. మనం ప్రింట్ చేసిన పత్రికలు తక్కువ మోతాదుల్లో ఉన్నప్పటికీ, వాటిని జెరాక్స్ తీసి పంచిన వారు ఎంతోమంది ఉన్నారు. వాక్యం ద్వారా ఎదిరించలేని తప్పుడు బోధకులకు వారు జెరాక్స్ తీసి పంపించి నోరు ముయ్యించిన సంఘటనలు ఎన్నో మనకు తెలుసు. గనుక వాటినన్నిటినీ మరళా మనం రీప్రింట్ చేయవలసి ఉంది. గనుక మీవంతు సహకారం అందించి వాటి రీప్రింట్ కొరకు మీరు సహాయపడవలసినదిగా కోరుచున్నాము. ఇదివరకు మనం ప్రింట్ చేసిన కరపత్రముల లిస్ట్ ఈ క్రింద పొందుపరుస్తున్నాము చూడండి. మీకు ఎవరెవరికి ఎన్నెన్ని పత్రికలు అవసరమో మాకు వ్రాయండి రీప్రింట్ అవ్వగానే మీకు పంపిస్తాము. ఈ పరిచర్యలో పాలుపొందు ప్రతీ ఒక్కొక్కరినీ పరమతండ్రియైన యావె (యషువ మెస్సీయ) అత్యధికముగా దీవించి ఆశీర్వదించును గాక!

1. అబద్ధ బోధకుల ఆదివారం ఆరాధన
2. అబద్ధ బోధకుల గుడ్‌ఫ్రైడే–ఈస్టర్ సన్‌డే
3. అబద్ధ బోధకుల లెంట్ దినములు
4. అబద్ధ బోధకుల క్రిస్ట్‌మస్
5. అబద్ధ బోధకుల ప్రభురాత్రి భోజన సంస్కారము
6. అబద్ధ బోధకుల యేసునామము
7. అబద్ధ బోధకుల మట్టలాదివారము
8. అబద్ధ బోధకుల క్రొత్త సంవత్సరము జనవరి 1
9. అబద్ధ బోధకుల వాచ్‌నైట్ సర్వీస్ డిశెంబర్ 31
10. అబద్ధ బోధకుల పెండ్లి కాని పరిచర్యలు
11. అబద్ధ బోధకుల అపవిత్రనామములు
12. అబద్ధ బోధకుల బాప్తీస్మములు
13. అబద్ధ బోధకుల వాక్యంలో లేని దినములు
14. అబద్ధ బోధకుల సంస్థలు–సంఘాలు
15. అబద్ధ బోధకుల బైబిలు సొసైటీ–1
16. అబద్ధ బోధకుల త్రిత్వం–దిత్వం 1,2
17. అబద్ధ బోధకుల వితర్కవాదములు
18. అబద్ధ బోధకుల గుణలక్షణములు
19. అబద్ధ బోధకుల యహ్వ/య:వ: నామములు
20. అబద్ధ బోధకుల పెంతెకోస్తు సీవాన్ 6
21. అబద్ధ బోధకుల తెలుగు, ఇంగ్లిష్, గ్రీకు బైబిల్స్
22. అబద్ధ బోధకుల లూనార్ షబ్బాత్
23. అబద్ధ బోధకుల వాక్యంలోలేని పండుగలు
24. అబద్ధ బోధకుల బైబిల్స్ మరియు తప్పుడు తర్జుమాలు
25. అబద్ధ బోధకుల ఆశ్రమాలు, నాయకత్వం
26. అబద్ధబోధకులైన స్త్రీలు
27. అంత్యకాలంలో అబద్ధ బోధకులు ఎవరు?
28. ఎవడీ జయశాలి ప్రకటన 6:2?
29. సర్వజనులకు ఒక్కడే పరమాత్ముడు
30. బాప్తీస్మం అంటే ఏమిటి? ఏ నామంలో పొందాలి?
31. ఎవరీ రెవరెండ్లు?
32. ఆయన నిజమైన పేరేమో నీకు తెలియునా?
33. క్రైస్తవ సంస్థలు – యషువ మెస్సీయ సమాజము
34. అపోస్తులులు యూదులా లేక క్రైస్తవులా?
35. నిజమైన షబ్బాతీయుని నియమ నియామక కాలములు
36. యషువ మెస్సీయ సమాజములో నిజమైన సేవకులు ఎవరు?
37. యేసు నామము వారి మోసం
38. గల్ఫ్ దేశములో క్రైస్తవుల స్థితి
39. యషువ మెస్సీయ నిజమరణపునరుత్థాన దినములు అబీబ్ 14–17
40. యషువ మెస్సీయ జన్మదినము ఏతానీమ్ 15
41. మీసములు–గడ్డములు తీసివేయుట బోధకులకు తగునా?
42. ఆది అపోస్తులులకు యేసు క్రీస్తు నామము తెలుసా?
43. బైబిలు పండుగలు
44. ఆది అపోస్తులులు సమాజము మీకు తెలుసా?
45. యేసునామము వారలారా! మీరు పొందిన/ఇచ్చుచున్న బాప్తీస్మము వాక్యానుసారమేనా?
46. తెలుగు బైబిలు చరిత్ర
47. మీరు పొందిన బాప్తీస్మం వాక్యానుసారమేనా?
48. మీరు క్రైస్తవులా? అయితే ఇది మీకోసమే
49. ఆది అపోస్తులులు–నకిలీ అపోస్తులులు
50. ప్రభుదినము ఆదివారమా? శనివారమా?

**ఎడిటర్ నోట్**

ప్రియ పాఠకులకు షలోం. పత్రికను ఉచితముగా పొందుచున్నవారు తప్పక సం॥ర చందా రూ. 50/– పంపి పత్రికను పొందవలెను. ఈ పరిచర్య ద్వారా బాప్తీస్మము పొంది సత్యములో నడచుచున్న సహోదరులు తప్పక పత్రిక పరిచర్యకై సహకరించవలెను. దూరముగా ఉన్న సహోదరులు తమ కానుకలను ఆన్‌లైన్ ద్వారా పంపించవచ్చును.

**Isaac E. Kusuma**
Online A/C No. **10664134898**
Bank Code 0885
SBI, Narsapur, W.G.Dt

**Isaac E. Kusuma**
Online A/C No.**ABG 0361-10025001028**
Bank Code 0361
Andhra Bank, Malikipuram

Printed, Published and Owned by Isaac. E. Kusuma and Printed at Ratna Offset, Malikipuram -533 253. E.G. Dt. and Publsihed at Malikipuram Editor Isaac E. Kusuma. All rights reserved